క్లుప్తంగా

మాదాలవారిపాలెం సొసైటీ చైర్మన్‌గా ఈశ్వర్‌రెడ్డి

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని మాదాలవారిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి(పీఏసీఎస్) నూతన త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గత త్రిసభ్య కమిటీలో సభ్యుడిగా ఉన్న మాదాలవారిపాలెం గ్రామానికి చెందిన ఆనికాళ్ల ఈశ్వర్‌రెడ్డి చైర్మన్‌గా, తుమ్మగుంట గ్రామానికి చెందిన బీరం బ్రహ్మారెడ్డి, కంభాలపాడుకు చెందిన మల్లాపురం నరసింహులును సభ్యులుగా నామినేట్ చేశారు. తమ నియామకానికి సహకరించిన మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో రైతుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

స్పందన అర్జీలపై జేసీ సమీక్ష

గిద్దలూరు రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గురువారం నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, వీఆర్‌ఓలకు స్పందన అర్జీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందనలో వచ్చిన అర్జీదారుల నుంచి సేకరించిన నివేదికలను ఆయన పరిశీలించారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, తహసీల్దార్ డి.సీతారామయ్య, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కళ్ల కలకతో అప్రమత్తంగా ఉండాలి

పుల్లలచెరువు: కళ్ల కలకతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రవినాయక్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక ముటుకుల వైద్యశాలలో సిబ్బందికి సూచనలు చేశారు. కళ్లకలక వ్యాపించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. కళ్లకలక వైరస్‌తో వస్తుందని, గాలి, నీరు, టవల్స్, జేబు రుమాలు, దుస్తులతో ఒకరి నుంచి మరకరికి వ్యాపిస్తుందన్నారు. కళ్లు ఎర్రబడడం, వాపు, నొప్పి, దురద, చీము కారడం, రెప్పలు అతుక్కుపోవడం, వెలుతురు చూడలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. నొప్పి తగ్గడానికి ఐబ్రోఫెన్ ప్లస్ పారసిటమాల్ మాత్ర తీసుకోవాలని సూచించారు. కళ్లను ఎక్కువగా తాకడం, నలపడం చేయరాదన్నారు. నులి పురుగుల నివారణ, మిషన్ ఇంద్ర ధనస్సు ఫీవర్ సర్వేపై అవగాహన కల్పించాలన్నారు.

పొదిలి తహసీల్దార్‌కు సన్మానం

పొదిలి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డిని గురువారం హ్యూమన్ రైట్స్ సభ్యులు సన్మానించారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, సయ్యద్ నయీం, శ్రీనివాసరెడ్డి, రాంగోపాల్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

జీప్ ఢీకొని ఉపాధ్యాయుడికి తీవ్రగాయాలు



కంభం: స్థానిక బైపాస్ రోడ్డులో సింధూరి రెస్టారెంట్ సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ మస్తాన్(దివ్యాంగుడు) స్కూటీని జీపు ఢీకొట్టడంతో తీవ్ర గాయలయ్యాయి. అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిపోయిన ఆయనను స్థానికులు ఆటోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జీప్ జామకాయల లోడుతో విజయవాడ నుంచి బేస్తవారిపేటకు వెళ్తోంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు.

దర్శిలో ఎన్నడూ లేని అభివృద్ధి



అగ్రి ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

- ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్
- డాక్టర్ వైఎస్సార్ అగ్రిల్యాబ్ ప్రారంభం
- 50 పడకల ఆస్పత్రి భవనం కూడా..

దర్శి: గత ప్రభుత్వాల్లో నియోజకవర్గంలో ఎన్నడూ జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలోనే జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. దర్శి నగర పంచాయతీ పరిధి శివరాజనగర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రూ.58.69 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్, రూ.2.10 కోట్లతో పట్టణంలోని 50 పడకల ఆస్పత్రి నూతన భవనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అగ్రి ల్యాబ్‌లో ప్రత్యేక పూజలు చేశారు. ఆస్పత్రిలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభోత్సవాలు చేశారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో నాలుగు ల్యాబ్‌లు రాగా అందులో ఒకటి దర్శిలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అధునాతన పరికరాలతో ఏర్పాటు చేసిన ల్యాబ్ ఈ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు నాణ్యత తెలుసుకునేందుకు అగ్రి టెస్టింగ్ దోహద పడుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంట ఇన్సూరెన్స్‌తో కలిగే ప్రయోజనాలు, ఖరీఫ్ సీజన్‌లో వచ్చిన ఇన్సూరెన్స్‌ల గురించి తెలిపారు. అనంతరం 50 పడకల ఆస్పత్రిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈ వైద్యశాలలో ముగ్గురే వైద్యులు ఉండేవారని చెప్పారు. ప్రస్తుతం 11 మంది వైద్యులు, నర్స్‌లు, పారామెడికల్ సిబ్బంది కొరత లేకుండా అందరికీ వైద్యం అందేలా 50 పడకలతో ఆస్పత్రిని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే ఆస్పత్రిలో 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధికి సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిశెట్టి శ్రీధర్, మద్దిశెట్టి రవీంద్ర, డీసీహెచ్ఎస్ ఎస్ఎన్ మూర్తి, ఏడీఈ బాలాజీనాయక్, సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఏఓలు బాలకృష్ణ నాయక్, లక్ష్మీనారాయణ, మధుబాబు, ప్రసాద్, ఫరూక్, వెంకట్రావు, కోటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ కొరివి ముసలయ్య, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, కౌన్సిలర్‌లు వీసీరెడ్డి, మేడం మోహన్‌రెడ్డి, నాయకులు కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం



ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్: రాజకీయాలు, కులమతాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం మండలంలోని వేములకోట లోని జంకె రామిరెడ్డి కాలనీలో సచివాలయ-1 పరిధిలో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రజలు చెప్పిన పలు సమస్యలను ఎమ్మెల్యే ఓపికగా విని నోట్ చేసుకుని సంబంధిత శాఖాధికారులతో అక్కడికక్కడే మాట్లాడి కొన్నింటిని పరిష్కరించారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తానన్నారు. ముందుగా పార్టీ నాయకులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంజె రాజేశ్వరి గురవయ్య, ఎంపీటీసీ నంద్యాల వీరయ్య, పార్టీ నాయకులు జంకె వెంకట నారాయణరెడ్డి, ఏరువ దేవిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చాగంటి నారాయణరెడ్డి, గుండారెడ్డి లక్ష్మీరెడ్డి, గోగు రామయ్య, గోగు కొండయ్య, అంకయ్య, జంకె మోహన్‌రెడ్డి, నికరంపల్లి ఎంపీటీసీ తిరుమలరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, ఏపీఎం రమేష్, ఏఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ సెక్రటరీ నారాయణరెడ్డి, వీఆర్‌ఓ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా తొలుత ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు
- యర్రబాలెంలో సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కంభం: సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించడం ద్వారా ప్రజలకు సేవలు వేగవంతమవుతాయని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని యర్రబాలెంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజల సమస్యలు తమ గ్రామాల్లోనే పరిష్కారమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు సచివాలయాల ద్వారా నేరుగా ఇంటి వద్దకే చేరుస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులను సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌లు మద్దు శ్రీనివాస్, నాగార్జున, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని నడిగడ్డలో శుక్రవారం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.పోలిరెడ్డి తెలిపారు. నడిగడ్డలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారు. మండలంలోని వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. దొనకొండ మండలం తెల్లబాడుకు చెందిన బి.అజయ్ ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా దర్శి-అద్దంకి ప్రధాన రహదారిలో ఉల్లగల్లు వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనం లారీ ముందు భాగం కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో అజయ్‌కు తీవ్ర గాయాలు కాగా 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. 108 సిబ్బంది నరేష్‌బాబు, బాలకృష్ణ, విజయ్‌కుమార్‌లు ప్రథమ చికిత్స చేశారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

కంభం: సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉపయోగపడుతుందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండలంలోని యర్రబాలెం సచివాలయం పరిధిలో పర్యటించారు. నాయకులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే.. వారికి అందుతున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకున్నా, ఇతర సమస్యలు ఉన్నా గ్రీవెన్స్‌లో నమోదు చేసుకొని వెంటనే పరిష్కరించేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సంతోషంగా ఉన్నందునే గ్రామాల్లో తిరుగుతుంటే ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతూ ఆదరిస్తున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంకా ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారున్నారా, క్షేత్రస్థాయిలో ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయో గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు. సర్పంచ్ మద్దు శ్రీనివాస యాదవ్, అర్ధవీడు ఎంపీపీ మేడూరి వెంకట్రావు, కంభం జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, ఎంపీటీసీ జమ్ములదిన్నె లక్ష్మీదేవి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, కొత్తపల్లి శ్రీను, ఎంపీటీసీలు రఫీ, ఆనంద్, సయ్యద్ సలీం, చిన్న కంభం సర్పంచ్ రసూల్, నాయకులు జమ్ములదిన్నెరంగారెడ్డి, రాజమోహన్, పిక్కిలి లక్ష్మీదేవి, ఆదినారాయణ, మామిళ్ల పుల్లయ్య, నెమిలయ్య, పోలయ్య, రాజయ్య పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి



పొదిలిలో మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి



నాగంపల్లిలో పౌష్టికాహారం అందిస్తున్న ఎంపీటీసీ

పొదిలి: శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి మెరుగ్గా ఉంటుందని సీడీపీఓ సుధమారుతి చెప్పారు. పట్టణంలోని దాసరివీధి, తూర్పుపాలెం 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలు తాగిన బిడ్డలు చురుగ్గా ఉంటారని, తెలివితేటలు కూడా పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సావిత్రి, ఏఎస్ఎం విజయ, ఎంఎస్‌కే సీహెచ్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు.. ఆనంద నిలయాలు

కొనకనమిట్ల: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం గొట్లగట్టు, నాగంపల్లి గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆనంద నిలయాలుగా తీర్చిదిద్దేందుకు కార్యకర్తలు కృషి చేయాలని చినమనగుండం ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, గొట్లగట్టు సర్పంచ్ సుఖ్‌దేవ్ సూచించారు. సీడీపీఓ సుధామారుతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటర్ వెరిఫికేషన్ సర్వే

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో బీఎల్‌ఓలు గురువారం ఇంటింటికీ వెళ్లి ఓటర్ వెరిఫికేష్ సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, పెళ్లి చేసుకుని వెళ్లిన వారిని గుర్తించి వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ దాసు సూచించారు. ప్రతి బీఎల్వో తప్పని సరిగా వారికి కేటాయించిన ఇళ్లలో తప్పక తనిఖీ చేయాలన్నారు. వెరిఫికేషన్ పక్కాగా జరగాలన్నారు. గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటుర్‌గా చేరేందుకు గ్రామాల్లో ఉన్న బీఎల్వోల వద్ద లేక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని ప్రజలకు తహసీల్దార్ దాసు సూచించారు.

పల్లెవనం పార్కును పరిశీలించిన డీఎఫ్ఓ

దర్శి: దర్శి పల్లెవనం పార్కును డీఎఫ్ఓ కె.మోహన్‌రావు గురువారం సందర్శించారు. డీఎఫ్ఓతో పాటు రేంజ్ అధికారి కేవీ నాగేంద్రరావు, సెక్షన్ అధికారి మోహన్‌రావు, ఒంగోలు బీట్ అధికారి శశిభూషణ్ యాదవ్‌లు కూడా హాజరయ్యారు. గతంలో మాదిరిగానే పార్కులో జరుగుతున్న పనులు పరిశీలించారు. ఇక్కడ పనులు పూర్తయ్యాయా లేదా...అనే వివరాలు కానీ..ఇక్కడ జరిగిన రూ.45 లక్షల అవినీతి గురించి కానీ విలేకరులు ప్రశ్నించినా అధికారులు నోరు విప్పడం లేదు. గతంలో స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతి ప్రసాద్ వచ్చినప్పుడు కూడా ఇదే తంతు కొనసాగించారు. ఎవరు వచ్చినా మౌనమే సమాధానం కావడంతో అవినీతి నిజమే అన్న అనుమానాలకు బలం చేకూరుతోంది.

గ్రామ స్వరాజ్యం.. జగనన్నతో సాకారం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- వద్దిమడుగులో సచివాలయం, ఆర్బీకే ప్రారంభం



సచివాలయం, ఆర్బీకేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ

కొనకనమిట్ల: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ వ్యవస్థతో సాకారమైందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం వద్దిమడుగు గ్రామంలో నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. వారికి స్థానిక సర్పంచ్ పిన్నిక పిచ్చయ్యయాదవ్, ఎంపీటీసీ చొక్కర వెలుగొండయ్య, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. వైఎస్ జగన్ అధికారం చేపట్టిన వెంటనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి సుమారు 1.36 లక్షల మందికి ఉద్యోగాలిచ్చారని పేర్కొన్నారు. ప్రజల వద్దకే పాలన నినాదంతో ప్రతి పనికి కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట సమస్యల పరిష్కారమయ్యేలా సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. ప్రజా సంకల్పయాత్రలో జగనన్న ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ రాచమళ్ల వెంకటరామిరెడ్డి, సొసైటీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మంచికల కోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొండకు వెళ్లే దారిని ఆక్రమించిన వారిపై చర్యలు



డీటీ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందిస్తున్న పశు పోషకులు

కురిచేడు: గొర్రెలు మేపుకునేందుకు కొండకు వెళ్లే దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే దారిని విడగొట్టి గొర్రెల మేతకు ఇబ్బంది లేకుండా చూడాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, రైతు సంఘ దర్శి డివిజన్ కార్యదర్శి సందు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 77లో 19 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉందని, ఈ భూమి మీదగా పూర్వం నుంచి బండి బాట ద్వారా కొండకు వెళ్లేందుకు దారి ఉండేదని, ఆ దారి ద్వారా పశువులు తోలుకుని వెళ్లే వారని, ఇటీవల పెత్తందారులు ఈ భూమిని బినామీ పేర్లతో తమ బంధువులకు పట్టాలు చేయించి దారిని ఆక్రమించి పశువులను రానివ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. పంట వేసిన సమయంలో పశువులు కొండకు వెళ్లడం తప్ప వేరే మార్గం లేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినా ఫలితం లేదన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీకాంత్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ముప్పా శ్రీనివాసులు, తెల్లమేకల ఆంజనేయులు, రావులపల్లి గాలయ్య, వెంకటయ్య, మేకల పుల్లయ్య, ముప్పా గిరిబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతంగా నిర్వహించాలి

కంభం: స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి సూచించారు. మండలంలోని జంగంగుంట్లలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. రెండు రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 కరపత్రాలు విడుదల చేశారు. ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సర్పంచ్ సుజాత, కార్యదర్శి కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి జన్మదిన వేడుకలు



దర్శి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ జన్మదిన వేడుకలు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చందలూరు లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాశీనాయన ఆశ్రమంలో ఎలక్ట్రికల్ వంట తయారీ మిషన్‌లను అందజేసి అన్నదానం చేశారు. చలివేంద్రం వెంకటాచల క్షేత్రంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శి మోడల్ స్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లు పంపిణీ చేశారు. శ్రీ షిర్డి సాయిబాబా వృద్ధాశ్రమంలో బియ్యం, మంచాలు, దుప్పట్లు, దిండ్లు పంపిణీ చేశారు. పొదిలి రోడ్డులో దద్దాలమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే మొక్కలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కేక్‌లు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.

కురిచేడు: ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పుట్టిన రోజు వేడుకలు వృద్ధాశ్రమంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వృద్ధాశ్రమంలో నిర్వహించటం సంతోషకరంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పడమర వీరాయపాలెం శ్రీ కరుణా వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు సొసైటీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి ఘనంగా నిర్వహించారు. అనంతరం కేకు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ డైరెక్టర్ కాశయ్య, మండల సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్‌కుమార్, మాజీ వైస్ సర్పంచ్ గుంటక నాసరరెడ్డి, కాటం పెద్దిరెడ్డి, సచివాలయ కన్వీనర్ కిలారి నర్సింహులు పాల్గొన్నారు.



కురిచేడు: వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

రాచర్ల: మండల కేంద్రం రాచర్ల ఎస్సీ కాలనీకి చెందిన కస్టర్-29లో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ గుర్రం చంద్రశేఖర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఆయన్ను తొలగిస్తున్నట్లు ఎంపీడీవో కె.కవితా చౌదరి గురువారం తెలిపారు. అగస్టు 1వ తేదీన పింఛన్‌ల పంపిణీ సహకాలంలో చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ కాశీరావు ద్వారా పింఛన్‌లు పంపిణీ చేయించారు. చంద్రశేఖర్ గతంలో పింఛన్ సొమ్మును బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేయించకుండానే పింఛన్ దారులకు పింఛన్ పంపిణీ చేశాడని, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరనాయక్ విచారించడంతో అతని విచారణ మేరకు గ్రామ వలంటీర్ చంద్రశేఖర్‌ను పూర్తిగా విధుల నుండి తొలగించినట్లు ఎంపీడీవో కవితా చౌదరి తెలిపారు.

తీరిన రోడ్డు సమస్య

బేస్తవారిపేట: మండలంలోని పాత మల్లాపురం రోడ్డు సమస్య తీరడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా బీటీ రోడ్డు ఛిద్రమై లోతైన గుంతలు పడ్డాయి. అడుగు అడుగుకు లోతైన గుంతలు ఉండటంతో రాకపోకల సమయంలో తీవ్ర అసౌకర్యంగా ఉండేది. ఆటోలు, మోటార్ సైకిళ్లపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. కలగొట్ల సమీపంలోని ఒంగోలు-నంద్యాల హైవే రోడ్డు నుంచి కలగొట్ల, గంగిరెడ్డుల కాలనీ, కొత్తమల్లాపురం మీదుగా పాతమల్లాపురంకు రూ.1.70 కోట్ల నిధులతో రోడ్డు మరమ్మతుల పనులు పూర్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడిన నాలుగు గ్రామాల ప్రజలు నేడు రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.